క్లుప్తంగా

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందించిన సొసైటీ సభ్యులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సింగుపురం గ్రామానికి చెందిన దంత చిన్నారావు కుటుంబానికి స్మాల్ సర్వీస్ టు సొసైటీ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. చిన్నారావు ఆరోగ్య సమస్యలతో బాధపడుతుండగా.. భార్య మరణించింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోదరుడు వెంకన్నకు ఇద్దరు కుమార్తెలు. అతని భార్య, తల్లి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో దాతలు స్పందించి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీసీ టీవీ ఏర్పాటు



ఆలయ కార్యాలయంలో అమర్చిన మానిటర్

సాక్షి ఎఫెక్ట్...

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో సీసీ కెమెరా వ్యవస్థను అధికారులు ఎట్టకేలకు చక్కదిద్దారు. 'మూలకు చేరిన నిఘా నేత్రం' పేరిట 'సాక్షి'లో ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి ఇన్‌చార్జి ఈవో జి.గురునాథరావు స్పందించారు. ఈఓ కార్యాలయంలో ఉన్న సీసీ మోనిటర్‌కు రిపేర్ చేయించి తిరిగి అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో 16 సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయని చెప్పారు. మూడు రోజుల కిందట గార మండల స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆర్.జనార్దనరావు వచ్చి సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలించారని తెలిపారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు సహకరించండి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నేతలు

శ్రీకాకుళం/శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అంబేడ్కర్ జంక్షన్‌లో కాంస్య విగ్రహం ఏర్పాటుకు సహకరించాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు తైక్వాండో శ్రీను, కంఠ వేణు కోరారు. ఈ మేరకు ఆదివారం కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న విగ్రహం స్థానంలోనే కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని విన్నవించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెరవీధి మెహెర్ కేంద్రంలో అవతార్ మెహర్‌బాబా 131వ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అభినయ నృత్య నికేతన్ గురువు నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శిష్యులు భక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పి.వి.రంగప్రసాద్, వరప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, రాజు, సురేష్, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాంతారావు మృతికి సంతాపం



సంతాపం తెలియజేస్తున్న ఉపాధ్యాయులు, కళాకారులు

జి.సిగడాం: జి.సిగడాం–పొందూరు మండలాల ప్రజలకు సుపరిచితులైన విశ్రాంత ఉపాధ్యాయుడు, నంది అవార్డు గ్రహీత, కళాకారుడు కొల్లకూరి శాంతారావు(74) ఆదివారం మృతి చెందారు. ఈయన మృతి పట్ల కళాకారులు ముళ్లపూడి రామచంద్రరావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు కె.విజయకుమార్, ఎం.రమణారావు, పి.తిరుమలరావు, దండా శ్రీనివాసరావు, పొసెపు సత్యారావు, గిడిజాల భాస్కరరావు, బూరాడ శ్రీనివాసరావు, పొగిరి జగన్నాథం తదితరులు సంతాపం తెలియజేశారు.

10న శంకుస్థాపన

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామంలో శివాలయం నిర్మాణం కోసం గ్రామస్తులు ఆదివారం ముహూర్తం ఖరారు చేశారు. మార్చి 10వ తేదీ ఉదయం 9 గంటలకు శంకుస్థాపన జరుగుతుందని, గ్రామస్తులంతా ఐకమత్యంగా మెలుగుతూ ఆయం నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు నిర్ణయించారు.

- శ్రీకూర్మనాథ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- మాఘమాసం నేపథ్యంలో దూర ప్రాంతాల నుంచి రాక
- అన్నదానం, పార్కింగ్ సమస్యలపై ఆవేదన

భక్తులు ఫుల్.. వసతులు నిల్!



ఆలయం పరిసరాల్లోని చల్లకంబాల జంక్షన్ వద్ద ట్రాఫిక్ జామ్



తాబేళ్ల పార్కు వద్ద టికెట్లు విక్రయిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయానికి మాఘమాసం ఆదివారం సందర్భంగా భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. అదే సమయంలో భక్తులకు సరైన సౌకర్యాలు లేక అవస్థలూ తప్పలేదు. కారు, ఆటో, బైక్‌లు పెట్టేందుకు స్థలం చూపించకపోవడం, పంచాయతీ పేరిట ఆశీలు మాత్రం వసూలు చేస్తుండటంతో మరింత ఇబ్బందులు ఎక్కువయ్యాయి. గ్రామంలో వాహనాలు ఎక్కడికక్కడ జామ్ అవ్వడంతో గ్రామస్తులు, రోడ్డు కిరువైపులా ఉన్న దుకాణదారులు అవస్థలు పడ్డారు. ఉచిత దర్శనం లైన్‌లో సమయం ఎక్కువ పడుతుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవంగా శ్రీకూర్మనాథలయం గర్భగుడిలోకి ఒకటే మార్గంలో వెళ్లడం, రావడం ఉండటంతో ఆలస్యం తప్పడం లేదు. తాబేళ్ల పార్కు వద్ద తాబేళ్లకు ఆహారం చెప్పి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది దర్శనం టికెట్లు విక్రయించడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి తాబేళ్ల ఆహారం కోసం దేవాలయం ప్రతి నెలా భక్తుల హుండీల ద్వారా సమర్పించిన ఆదాయంలో కొంత మొత్తం చెల్లిస్తున్నారు. రూ.20 క్యూలైన్‌లో ఉన్న భక్తులు సైతం దర్శనం చాలా ఆలస్యమవుతుండటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో జరిగే అన్నదానం కూడా చాలా తక్కువ సమయం పెడుతున్నారని పలువురు దూర ప్రాంత భక్తులు వాపోతున్నారు. కాగా, తాము మాత్రం 350 మంది భక్తులకు అన్నప్రసాదం అందించినట్లు అన్నదాన కేంద్రం ఇన్‌చార్జి తెలిపారు. ఆలయంలో నరసన్నపేటకు చెందిన పది మంది మహిళలు భక్తులకు సేవలందించారు.



శ్రీకూర్మనాథుని దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ఇన్‌చార్జిలు.. ఔట్‌సోర్సింగ్‌లు..

ఆలయ ఇన్‌చార్జి ఈవోగా ఉన్న జి.గురునాథరావు పలాస గ్రూపు టెంపుల్స్, రావివలస ఎండల మల్లన్న ఆలయ ఈవోగా పనిచేస్తున్నారు. ఇక్కడ ఆదివారం ఎక్కువ సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా ఉన్నా శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రావివలస శివాలయంలోనే ఉండిపోయారు. కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగి నర్సుబాబు రికార్డు నమోదు చేసే అధికారిగా ఉన్నారు. మిగిలిన వ్యక్తులు ఔట్‌సోర్సింగ్ సిబ్బందే కావడంతో ఇక్కడి సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారు. అరసవిల్లి ఆదిత్య ఆలయంలోని కొంతమంది సెక్యూరిటీ సిబ్బందిని ఇక్కడికి తీసుకువచ్చారు.

భోజనం దొరకలేదు



శ్రీకూర్మం ఆలయానికి కుటుంబ సమేతంగా దర్శనానికి వచ్చాం. అన్నదాన కేంద్రం వద్దకు వెళ్లేసరికే భోజనాలు అయిపోయాయని చెప్పారు. మేం చూస్తుండగానే చాలా మంది భోజనాలు చేస్తున్నా మాకు టిక్కెట్లు ఇవ్వలేదు.

– సంతోషమ్మ, భక్తురాలు

ఏర్పాట్లు చేశాం..



ప్రతిశని, ఆదివారాల్లో ప్రైవేటు వ్యక్తులను సెక్యూరిటీ గార్డులను నియమిస్తున్నాం. అన్నదాన ప్రసాదాన్ని నాణ్యతగా పెడుతున్నాం. ఆలయం అంతా సీసీ కెమెరాల నీడలోనే ఉంది. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే అప్రమత్తమై సలహాలు ఇస్తున్నాం.

– జి.గురునాథరావు, ఆలయ ఇన్‌చార్జి ఈవో, శ్రీకూర్మనాథాలయం

● ఎక్కడి వాహనాలు అక్కడే



మాఘమాసం చివరి ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఈ క్రమంలో అరసవల్లి మిల్లు కూడలి నుంచి ఆలయ సింహద్వారం వరకు వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. – శ్రీకాకుళం క్రైమ్

● జయ.. జయహో రాజరాజేశ్వరి



చిన వత్సవలసలో కొలువున్న రాజులమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి మూడో వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు సమీప తోటల్లోనూ, ఆరుబయట బసచేసి అమ్మవారితో పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం వరకు మొక్కులు తీర్చుకున్నారు. –గార

● చెరువు కాదు స్థలమే..



శ్రీకాకుళం నగరంలోని హోమియోనగర్ కాలనీలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలం చెరువును తలపిస్తోంది. వాడుక నీరంతా వచ్చి ఇక్కడే చేరడంతో దోమలు, పందులు, పశువులు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగునీరు నిల్వ ఉంటున్న విషయం కార్పొరేషన్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

● యోగానందం



ప్రతిరోజూ తరగతి గదిలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న చిన్నారులు ఆదివారం మాత్రం పుస్తకాలకు స్వస్తి పలికారు. యోగాసనాలు వేస్తూ మానసికోల్లాసం పొందారు. లావేరు శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ మురపాక శ్రీనివాసరావు ప్రతి ఆదివారం చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. చిన్నచిన్న పోటీలు నిర్వహిస్తూ చిన్నారులను ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల

పాతాళంలోకి పాఠశాలల ప్రగతి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ

- జీవో 117 సవరణలతో విద్యావ్యవస్థ నిర్వీర్యం
- ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో 12611 ప్రభుత్వ పాఠశాలలు ఏక ఉపాధ్యాయునితోనే నడుస్తున్నాయని.. దీంతో విద్యా ప్రమాణాల ప్రగతి ఎలా సాధ్యమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని దాసరిక్రాంతి భవన్‌లో ఆదివారం ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 44,572 పాఠశాలల్లో 12611 పాఠశాలలు సింగిల్ టీచర్లతోనే నడుస్తున్నాయని చెప్పారు. తాజా జీవో 117 సవరణలోనూ వాటికి మోక్షం కలగలేదన్నారు. ఫౌండేషన్ పాఠశాలల్లో విద్యార్థి టీచర్ నిష్పత్తి 1:30 పాటిస్తామని అధికారులు చెబుతున్నారని.. ఇలాగైతే ఇప్పుడున్న సింగిల్ టీచర్ పాఠశాలలు మరింత రెట్టింపవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు 45 రకాల యాప్‌లలో డాటా నమోదుతో పాఠాలపై పూర్తిస్థాయిలో దృష్టిపెట్టలేకపోతున్నామని చెప్పారు. కనీసం అత్యవసర, అనారోగ్య సమయాలలో సైతం సెలవు కూడా పెట్టలేక ఏకోపాధ్యాయులు తీవ్ర ఒత్తిడి, మానసిక వేదనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో 11 మంది పిల్లలు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలలో రెండో ఎస్జీటీ పోస్ట్ ఇస్తున్నప్పుడు.. ఏపీలో మాత్రం 21 మంది పిల్లలు దాటిన తర్వాతే పోస్టు ఇవ్వడానికి రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఫౌండేషన్ పాఠశాలలో 31 మంది పిల్లలు దాటిన తర్వాతే రెండో పోస్టు ఇస్తామని కూటమి నేతలు చెబుతుండటం .. పాఠశాల విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత ఏంటో అర్థమౌతుందన్నారు. 22 నెలలుగా పదోన్నతులు లేవని, 16347 పోస్టులతో మెగా డీఎస్సీ అంటూ కాలయాపనే తప్ప ఒక్క పోస్టును భర్తీ చేయలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, సీహెచ్ జగన్, జి.శ్రీనివాసరావు, కె.వి.రమణ, శ్రీకాకుళం, గార, ఎచ్చెర్ల మండలాల నుంచి పలువురు ఏకోపాధ్యాయులు హాజరయ్యారు.

ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజస్వామి చిత్రపటంతో తిరువీధి



పంచరత్న కీర్తనలు గానం చేస్తున్న బృందం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముందుగా త్యాగరాజ స్వామి చిత్రపటంతో త్యాగరాజు కృతులు ఆలపిస్తూ తిరువీధి నిర్వహించారు. అనంతరం విశాఖకు చెందిన ఆకొండి వేంకటరావు బృందం ఆధ్వర్యంలో పంచరత్న సేవ, స్థానిక కళకారుల త్యాగరాజ సంకీర్తనల ఆలాపన జరిగాయి. సాయంత్రం విజయవాడకు చెందిన విష్ణుభట్ల సోదరీమణులు కృష్ణవేణి, సరస్వతి పలు త్యాగయ్య కృతులను సుమధురంగా గానం చేశారు. వయొలిన్‌పై మావుడూరు సత్యనారాయణ శర్మ, మృదంగంపై బీవీఎస్ ప్రసాద్, ఘటంపై మావుడూరు సూర్యప్రసాదరావు వాద్య సహకారం అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న, ఇప్పిలి శంకరశర్మ, జె.జె.మోహనరావు, పి.శ్రీనివాసరావు, గౌరీశంకర శాస్త్రి, ఆనంద్‌బాబు, మండా శ్రీనివాస్, లక్ష్మీగణపతి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ చైర్మన్‌గా పురుషోత్తంనాయుడు



చౌదరి పురుషోత్తంనాయుడును అభినందిస్తున్న పెన్షనర్లు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర పెన్షనర్స్ జేఏసీ చైర్మన్‌గా చౌదరి పురుషోత్తంనాయుడు, జనరల్ సెక్రటరీగా సతీష్‌కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలో శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. చౌదరిని పలువురు అభినందించారు.

మల్లన్న తలపాగా ఊరేగింపు



మల్లన్న తలపాగాను ఊరేగిస్తున్న శివభక్తులు



ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశైల మల్లన్నకు అలంకరించేందుకు ఏటా శివరాత్రికి ఫాజుల్‌బాగ్‌పేట దేవాంగులు తలపాగా నేస్తారు. ఎప్పట్లాగే ఈ ఏడాది కూడా నెల రోజుల పాటు నియమ నిష్ఠలతో నేసిన తలపాగాను చేనేత కార్మికులు ఆదివారం ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా 11 మంది శివమాల ధారణ చేసి తలపాగాను సన్నిధానంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీవీఎస్ రాజు, బల్ల తిరుమలరావు, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

కోటదుర్గకు ప్రత్యేక పూజలు



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఎచ్చెర్ల క్యాంపస్: లావేరు మండలం పెద్దకొత్తకోట గ్రామంలో కోటదుర్గ అమ్మవారి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి స్నానఘట్ట అలంకరణ అనంతరం భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు.

పెంట విద్యార్థి ప్రతిభ



రమణ

జి.సిగడాం: మండలంలోని పెంట గ్రామానికి చెందిన అడప రమణ గత ఏడాది కేంద్రం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పరీక్ష ప్రతిభ కనబరిచాడు. దేశవ్యాప్తంగా 38 సీట్లు ఉండగా నాలుగు వేల మంది పరీక్ష రాశారు. ఓపెన్‌లో 19 సీట్లగాను కేంద్రంలో తెలుగు పండిట్ నెట్‌లో రమణ 9వ స్థానం సాధించి ఆంధ్ర యూనివర్సిటీలో స్టేట్ టాపర్‌గా నిలిచాడు. రమణ విజయంపట్ల తల్లిదండ్రులు అప్పన్న, అప్పలనర్సమ్మ, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఆమె నేత్రాలు సజీవం



బరాటం వెంకటరమణమ్మ(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: న్యూకాలనీలో నివాసముంటున్న బరాటం వెంకటరమణమ్మ(84) మృతిచెందడంతో ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుమార్తెలు పి.విమలకుమారి, టి.రమాదేవి, ఎం.ఉషా ముందుకొచ్చారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, సభ్యులు దుర్గాశ్రీనివాస్‌కు విషయం తెలియజేయగా నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, నంది ఉమాశంకర్‌లు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్‌వీప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 78426 99321 నంబరుకు తెలియజేయాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ లక్ష్మణ్‌నాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 23న జరిగిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ వెపన్ పోటీల్లో నాలుగు పతకాలతో సత్తాచాటారు. బి.కార్తికేయ, పి.షాన్ బంగారు పతకాలు, బి.మోహిత్ రజిత, జి.లిఖిత్ కాంస్య పతకాలతో మెరిశారు. వీరితో పాటు సీనియర్ కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడును స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ముద్దాడ సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ తరని అర్జున్‌చక్రవర్తి, సిబ్బంది ఆదివారం అభినందించారు.

ఉపాధ్యాయులకు అండగా ఉంటా



గాదె శ్రీనివాసులనాయుడికి సంఘీభావం ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ, అధ్యాపకుల పక్షాన నిలబడి వారికి అన్నింటా బాసటగా ఉంటానని.. తనపై నమ్మకం ఉంచి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై గాదెకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పనిచేసిన ఎమ్మెల్సీ అధికార పక్షానికి కొమ్ముకాసి, ఉపాధ్యాయుల సమస్యలను గాలికొదిలేశారని దుయ్యబట్టారు. విద్యారంగం నిర్వీర్యమైపోతున్నా.. కనీసం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఇప్పుడు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులే ఓ వ్యక్తికి కొమ్ముకాసి గెలిపించేందుకు ముందుకు రావడం, ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడం, భయపెట్టడం ఎంత మాత్రం సరికాదన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.గిరిప్రసాద్, జిల్లా అధ్యక్షుడు తంగి మురళీధర్‌రావు, కార్యదర్శి దానేటి కేశవరావు, సీపీఎస్ పోరాట కమిటీ కన్వీనర్ తిరుపాల్, పీఆర్టీయూ, ఆపస్, ఏపీటీఎఫ్ 1938, ఎస్టీయూ, పీడీ–పీఈటీ, ఆర్‌యూపీపీ, బీటీఏ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శివానుగ్రహం సాధించాలి



కార్తికేయశర్మను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శివ అనే రెండు అక్షరాలను రెండు దవడల మధ్య నిత్యం స్మరించగలిగితే కర్త బీజాలు నడుస్తాయని పెంట వశిష్ఠ కార్తికేయశర్మ అన్నారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో శివతత్త్వం– శివానుగ్రహం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివుడు అభిషేక ప్రియుడని చెప్పారు. శివానుగ్రహం సాధించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, మల్లేశ్వరరావు, విశ్వేశ్వరరావు, నాగేంద్ర, ఈశ్వరరావు, ఎన్.నరసింహమూర్తి, వి.కామేశ్వరరావు, సూరిబాబు, చంద్రరావు, సరస్వతి, అన్నపూర్ణ, లక్ష్మీ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కల్యాణోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకుని కింతలి మిల్లు సమీపంలోని లక్ష్మిడిపేటలో ఉన్న కోదండ రామస్వామి ఆలయం వార్షిక కల్యాణ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి నిత్య ఆరాధన కార్యక్రమంతో పూజలు ప్రారంభమయ్యాయి. యాగశాలలో హోమాలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సిక్కోలులో క్రికెట్ ఫీవర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయ్ వేదికగా భారత్, పాకిస్తాన్ మధ్య ఆదివారం జరిగిన కీలక మ్యాచ్‌ను సిక్కోలు క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకించారు.

పలుచోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్లు, టీవీలు, సెల్‌ఫోన్లలో చూసి సంబరపడ్డారు. భారత జట్టు విజేతగా నిలవడంతో క్రీడాభిమానులు సంబరాల్లో మునిగితేలారు.